క్లుప్తంగా

గ్రామస్తుల శ్రమదానం



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న గ్రామస్తులు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ నుంచి పాతతర్లపాడ్ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై పాతతర్లపాడ్ గ్రామస్తులు ఆదివారం శ్రమదానం చేశారు. ఈసందర్భంగా సొంత డబ్బులతో గుంతల్లో మట్టి పోయించి రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలను పొక్లెయిన్‌తో తొలగించారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో తామే స్వచ్ఛందంగా పనులు చేస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, శేఖర్‌రెడ్డి, చిన్న బాపు, రాకేష్, శేఖర్, సాయిరాం తదితరులు ఉన్నారు.

'ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై చర్యలు తీసుకోవాలి'

ఖానాపూర్: ప్రజల కోసం ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్‌ను అవమానపరిచిన బీఆర్ఎస్ నేత, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్‌నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ, లంబాడాల సంక్షేమానికి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాప్రభుత్వంలో సామాన్య కార్యకర్తగా ప్రజల కోసం ప్రశ్నించిన శ్యాంనాయక్‌ను అవమానించడాన్ని తాము ఖండిస్తున్నామని.. ఎమ్మెల్యే లక్ష్మి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

నిర్మల్‌టౌన్: పట్టణంలోని గాయత్రిపురం కాలనీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎడ్ల నర్సయ్య, అధ్యక్షుడిగా కృష్ణచారి, ఉపాధ్యక్షుడిగా కాశీ లింగం, కోశాధికారిగా చింతల శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీగా బొమ్మడి గంగాధర్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు



రాంచందర్‌రావుకు బాసర సరస్వతి అమ్మవారి ప్రసాదం అందిస్తున్న సతీశ్

బాసర: హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును బాసర మాజీ సతీశ్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. సరస్వతీ అమ్మవారి ప్రసాదం అందించి బాసరలో నెలకొన్న సమ్యలు వివరించారు. అమ్మవారి దర్శనానికి రావాలని కోరారు. బీజేపీ నాయకులు అచ్చుత్ రావు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



సాయం అందిస్తున్న మిత్రులు

దస్తురాబాద్: మండల కేంద్రానికి చెందిన గుబ్బలి శ్రీనివాస్ (36) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దస్తురాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003–2004లో అతడితో పదోతరగతి చదివిన మిత్రులు రూ.42వేలు జమ చేశారు. సదరు నగదును ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశా రు. కార్యక్రమంలో గ్రామస్తులు మల్లయ్య, రాములు, చిన్నరాజన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, వంతెన నిర్మాణానికి నిధులు

భైంసాటౌన్: హామ్ పథకంలో భాగంగా నియోజకవర్గంలో 127 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులిస్తూ జీవో.389 జారీ చేసినట్లు ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ తెలిపారు. ఆదివారం తన నివాసంలో వివరాలు వెల్ల డించారు. లోకేశ్వరం మండలం అర్లి వంతెనతోపాటు కిష్టాపూర్ మీదుగా లోకేశ్వరం వరకు రోడ్డు, భైంసా నుంచి గొడిసెర, కుభీర్, పార్డి(కె), పల్సి, సిరిపెల్లి వరకు 27 కిలోమీటర్ల మేర రోడ్డు, ముధోల్ నుంచి సింగన్‌గావ్ మీదుగా తానూరు, జౌల(కె), వడ్గాం మీదుగా మహారాష్ట్ర సరిహద్దు వరకు 18 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. త్వరలోనే నిధులు మంజూరవుతాయని.. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో టెండర్ల ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బావుల తవ్వకానికే మొగ్గు



దొదర్నాలో బావి చూపుతున్న రైతు

- స్వచ్ఛందంగా కొందరు..
- 'ఉపాధి' పథకం కింద నిర్మించుకుంటున్న రైతులు
- పంట దిగుబడులు పెరిగాయంటున్న గ్రామస్తులు

కుభీర్: బోర్లు వేసుకొని పంటలు సాగు చేసుకునే మండల రైతులు కొద్దిరోజులుగా వ్యవసాయ బావుల తవ్వకానికి ప్రాధాన్యమిస్తున్నారు. కొందరు స్వచ్ఛందంగా బావులు తవ్వుకుంటుండగా.. మరికొందరు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద వ్యవసాయ బావులను తవ్వుకుంటూ పంటలు పండించుకుంటున్నారు. ఆసక్తి, అవసరం కల్గిన జాబ్‌కార్డుదారులు ఉపాధి అధికారులకు దరఖాస్తు చేసుకుంటే వారు క్షేత్రస్థాయిలో పరిశీలించడంతోపాటు గ్రామసభ తీర్మానంతో అర్హులను ఎంపిక చేస్తారు.

బోర్లు ఫెయిలవడంతోనే..

కుభీర్ మండలంలోని వివిధ గ్రామాల్లో పంటలను పండించుకునేందుకు రైతులు వేసుకుంటున్న బోరు బావులు ఫెయిలవుతున్నాయి. దీంతో విసుగుచెంది.. బావుల తవ్వకాల వైపునకు మొగ్గు చూపుతున్నామని గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

ఇప్పటివరకు 12 బావుల తవ్వకం..

ఇప్పటివరకు ఉపాధిహామీ నిధులతో శివుని గ్రామంలో రెండు, మొహలలో ఒకటి, రాంనాయక్ గ్రామంలో మూడు, బెల్గాంతండాలో నాలుగు, రంజినిలో రెండు బావులను రైతులు తవ్వుకున్నారు. ఇవి ప్రస్తుతం చక్కగా పని చేస్తున్నాయి. ఒక్కో బావి నిర్మాణానికి సుమారు రూ.5.70లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇందులో 40 శాతం మెటీరియల్ కోసం, 60 శాతం కూలీలకు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. కుభీర్ మండలంలో సుమారు 13వేల మంది కూలీలకు జాబ్‌కార్డులుండగా వేసవిలో 3వేల మంది కూలీలు ఉపాధి పనులు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

స్వచ్ఛందంగానే తవ్వకాలు..

కొందరు రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా సొంతంగానే బావులు తవ్వుకుంటున్నారు. కుభీర్ మండలంలోని హల్దాలో ఐదు బావులు, దొదర్నాలో రెండు, బెల్గాంలో ఒకటి, చొండిలో ఒకటి, చాత గ్రామంలో రెండు వ్యవసాయ బావులను తవ్వి పంటలను పండించుకుంటున్నారు. ఇవే కాకుండా 30 ఏళ్ల కిందట తవ్వుకున్న బోరుబావులు కుభీర్‌లో నాలుగు, బెల్గాంలో ఒకటి, గొడిసెరలో ఒకటి, దొదర్నాలో రెండు ఉన్నాయి. అవి ప్రస్తుతం చక్కగా పని చేస్తున్నాయి.



బెల్గాంలో తవ్విన వ్యవసాయ బావి

'గిరి'వికాసంలోనూ అవకాశం..

ప్రస్తుతం గిరి వికాస్ పథకం కింద గిరిజన రైతులకు రెండున్నర ఎకరాలకు ఒకటి చొప్పున బోరుబావి ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

సొంతంగానే తవ్వుకున్నా..



నాకున్న మూడెకరాల్లో మూడు సార్లు బోర్లు వేసి ఆర్థికంగా నష్టపోయా. తిరిగి గతేడాది సొంతంగానే డబ్బులు రూ.2లక్షలు ఖర్చు చేసి బావి తవ్వుకున్నాను. గత యాసంగి సీజన్‌లో మొక్కజొన్న, శనగ పంటలు పండించుకున్నా. బావిలో నీళ్లు బాగానే ఉన్నాయి. – కె.రామకృష్ణ, హల్దా

పంటలు పండిస్తున్నా..



రెండేళ్ల కిందట ఉపాధిహామీ పథకం కింద వ్యవసాయ బావి తవ్వుకున్నా. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం రెండు పంటలు పండించుకుంటున్నాను. బావిలో నీళ్లు ఉండటంతో పంటలు బాగానే పండుతున్నాయి. – యశ్వంత్, రాంనాయక్ తండా

చక్కగా పనిచేస్తున్నాయి

మండలంలో ఇప్పటివరకు 12మంది రైతులు ఉపాధిహామీ పథకం కింద వ్యవసాయ బావులు తవ్వుకున్నారు. అన్ని చక్కగా పనిచేస్తున్నాయి. మరో 10 మంది రైతులు కూడా దరఖాస్తు చేసుకోగా వారికి సైతం బావులు మంజూరయ్యాయి. – రాథోడ్ హరిలాల్, ఏపీవో

'పీఏసీఎస్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న సునారికారి రాజేశ్

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి పీఏసీఎస్‌లో అక్రమాలకు పాల్పడ్డ వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి.. కాజేసిన నిధులను రికవరీ చేయాలని సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసి) ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.రెండు కోట్ల మేర నిధుల దుర్వినియోగంపై త్రీమెన్ కమిటీ విచారణ నిష్పక్షపాతంగా వేగంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. గతంలో పని చేసిన సీఈవో అక్రమాలకు పాల్పడినట్లు సంఘం డైరెక్టర్లు ఆధారాలతో ఫిర్యాదు చేసిన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. చైర్మన్, సీఈవోల అవినీతిని బహిర్గతం చేసి రెవెన్యూ రికవరీ యాక్టు ద్వారా రైతుల సొమ్ము వసూలు చేయాలని కోరారు. చర్యలు తీసుకోకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ డివిజన్ నాయకులు దుర్గం లింగన్న తదితరులున్నారు.

అలరించిన పాటల పోటీలు



పోటీల్లో పాల్గొన్న గాయకులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని పెన్షనర్ భవనంలో అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మెగా పాటల పోటీలను ఆదివారం నిర్వహించారు. ఇందులో 40 మందికి పైగా గాయకులు పాల్గొన్నారు. ప్రథమస్థానంలో వేణుగోపాల్‌వర్మ, ద్వితీయస్థానంలో గడ్డం రాధ, తృతీయస్థానంలో వాసర శ్రీకాంత్ నిలిచారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా నార్లాపురం రవీందర్, శ్రీ జోసెఫ్ బాబురావు, కవిత,ప్రముఖ న్యాయవాది వోస మహేందర్, డాక్టర్ రాములు వ్యవహరించారు. అనంతరం విజేతలకు షీల్డ్‌లు, ప్రశంసాపత్రాలను యం.సీ లింగన్న సౌజన్యంతో అందజేశారు. కార్యక్రమంలో జాతీయ రిటైర్డ్ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి యం.సీ.లింగన్న, చెనిగారపు నాగరాజు, డాక్టర్ కృష్ణంరాజు, అఖిల భారత చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు శ్రీరాముల శ్రీనివాస్, చిరంజీవి, పవన్‌కల్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ

భైంసారూరల్: కుంటాల మండలంలోని దౌనెల్లి గ్రామానికి చెందిన పీరాజీకి రూ.35 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆదివారం మండలంలోని దేగాం గ్రామంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులకు చెక్కు అందించారు. కార్యక్రమంలో నాయకులు హైమద్, శ్రావణ్, సుదర్శన్, లక్ష్మణ్, అర్జున్ తదితరులు ఉన్నారు.



చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కేంద్రం నిధులతో గ్రామాల అభివృద్ధి

ఖానాపూర్: కేంద్రప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని బీజేపీ నాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలో 194వ బూత్ కమిటీ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో కేంద్రం వాటానే ఎక్కువ ఉందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న 6 కిలోల సన్న బియ్యంలో ఐదు కిలోలు కేంద్రానివేనని పేర్కొన్నారు. ఈసందర్భంగా మోదీ 11 ఏళ్ల పాలనను వివరిస్తూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెక్కిళ్ల భూమన్న గౌడ్, నాయకులు వాల్గొట్ సాయికిరణ్, కిషన్, రాజన్న, నర్సయ్య, రాములు తదితరులు ఉన్నారు.



ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

'స్థానిక' ఎన్నికల్లో బీజేపీనే గెలిపించాలి

కుంటాల: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు గుణపాఠం చెప్పి.. బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ మండల కన్వీనర్ పసుల నవీన్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అందకూర్ గ్రామంలో బీజేపీ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి బీజేపీ, ప్రతి ఇంటికి బూత్ అధ్యక్షుడు అనే నినాదంతో ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను కరపత్రాలతో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు సాయినాథ్, నాయకులు ప్రశాంత్, లక్ష్మీనారాయణ, వినోద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పథకాలు వివరిస్తున్న నాయకులు

'కడెం'కు స్వల్ప ఇన్‌ఫ్లో

కడెం: కడెం ప్రాజెక్టుకు ఆదివారం 972 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 696.225 అడుగుల నీటిమట్టం ఉంది.

గడ్డెన్నవాగుకూ..

భైంసాటౌన్: పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు స్వల్ప ఇన్‌ఫ్లో వస్తోంది. ఎగువన కురిసిన వర్షానికి ఆదివారం ప్రాజెక్టులోకి 1,189 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ప్రస్తుతం 357.80 మీటర్లుగా ఉంది.

సంక్షిప్త వార్తలు

శివశంకర్‌కు నివాళి

ముధోల్: మండలకేంద్రంలోని గాంధీచౌక్‌లో ఆదివారం భారత సామాజిక న్యాయశిఖరం బీసీ రిజర్వేషన్ ప్రదాత పుంజాల శివశంకర్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం తాలూకా అధ్యక్షుడు రోళ్ల రమేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, బీసీ సంఘం అధ్యక్షుడు వరగంటి విఠల్, పల్లె నగేశ్, మాజీ సర్పంచ్ అనిల్, రాజేశ్వర్, తాటేవార్ రమేశ్, కోరి పోతన్న, గడ్డం సుభాశ్, లవన్, భాస్కర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సకల దేవతలకు ఆహ్వానం

కుంటాల: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం శ్రీకృష్ణ దేవాలయం, హనుమాన్ ఆలయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. సకల దేవతలను సప్తమి వేడుకలకు ఆహ్వానిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

కుంటాల: వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విమలాకర్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ విమలాకర్‌రెడ్డి పే ర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని మున్నూరుకాపు సంఘ భవనంలో హైదరాబాద్‌లోని కిమ్స్, సన్‌షైన్ ఆసుపత్రి డాక్టర్ విమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 260 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, మాజీ సర్పంచ్ సవ్వి అశోక్ రెడ్డి, నాయకులు జుట్టు లక్ష్మణ్, యినాథ్‌రెడ్డి, దేవదాస్, జుట్టు మహేందర్, మున్నూరుకాపు సంఘ గ్రామ కమిటీ అధ్యక్షుడు తోట రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

గజ్జలమ్మ ఆలయంలో పూజలు

కుంటాల: మండల కేంద్రంలోని గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

13లోపు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

ఖానాపూర్/నిర్మల్/లక్ష్మణచాంద/కడెం/లోకేశ్వరం: జూన్ 5 తర్వాత కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు ఈనెల 13లోగా రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఖానాపూర్ మండల వ్యవసాయాధికారి జగదీశ్వర్, నర్సాపూర్(జి) ఏవో రాంచందర్‌నాయక్, లక్ష్మణచాంద ఏవో వసంత్‌రావు, కడెం ఏవో దినేశ్, లోకేశ్వరం ఏవో గిరిరాజ్ తెలిపారు. 18 నుంచి 59 ఏళ్లున్న రైతులు దరఖాస్తు ఫారం, ఆధార్, పట్టా పాస్‌పుస్తకం జిరాక్స్‌లతోపాటు నామినీ ఆధార్ జిరాక్స్‌లను ఏఈవోలకు అందించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



గుంతలమయంగా మునిపెల్లి-మాచాపూర్ రోడ్డు



తారు లేచిన మల్లాపూర్-పార్‌పెల్లితండా రోడ్డు



అధ్వానంగా పార్‌పెల్లి-మల్లాపూర్ రోడ్డు

అంతర్గత రోడ్లకు మోక్షమెప్పుడో!

- రాకపోకలకు ప్రజల కష్టాలు
- పట్టించుకోని అధికారులు
- కాగితాలకే పరిమితమవుతున్న ప్రతిపాదనలు

లక్ష్మణచాంద: మండలకేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారాయి. ఏటా వర్షాకాలంలో చిన్నపాటి వర్షాలకే రోడ్లు అధ్వానంగా మారుతుండటంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర వేళ ఆసుపత్రికి వెళ్లేందుకు కష్టాలు పడుతున్నామని వాపోతున్నారు. ఎక్కడికక్కడ వర్షపునీరు నిలుస్తుండటంతో గుంతలు కన్పించక ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్నారు. రోడ్ల సమస్యను ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతోపాటు పాలకులకు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్యలివీ..

మండలంలో ధర్మారం గ్రామం నుండి మల్లాపూర్, మాచాపూర్, మునిపెల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు.. మల్లాపూర్ సమీపంలో కిలోమీటర్ మేర గుంతలమయంగా మారింది. మరమ్మతులు చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకరంగా మారిన మల్లాపూర్-ధర్మారం రోడ్డు

- మల్లాపూర్ నుంచి ధర్మారం వెళ్లే మూడు కిలోమీటర్ల రోడ్డు కిలోమీటర్ మేర దెబ్బతింది. మునిపెల్లి నుంచి మాచాపూర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న కిలోమీటరున్నర రోడ్డు ధ్వంసమైంది.
- మల్లాపూర్ నుంచి పార్‌పెల్లితండాకు వెళ్లే మార్గంలో కిలోమీటరున్నర మేర గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పార్‌పెల్లి నుంచి మల్లాపూర్ గ్రామానికి వెళ్లే రహదారి, ధర్మారం నుంచి పార్‌పెల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో ధర్మారం సమీపంలో రోడ్డు అడుగడుగునా గుంతలమయంగా మారింది.
- పార్‌పెల్లి గ్రామం నుంచి లక్ష్మణచాందకు వెళ్లే ప్రధాన రోడ్డు 2.5 కిలోమీటర్లు కంకర తేలి గుంతలమయంగా మారింది.
- చామన్‌పెల్లి గ్రామం నుంచి మునిపెల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు కిలోమీటర్ మేర గుంతలమయంగా మారింది.

అడుగడుగునా గుంతలే



మా గ్రామం నుంచి నిర్మల్, లక్ష్మణచాంద మండలకేంద్రం వెళ్లేందుకు రోడ్లు సరిగా లేవు. అడుగడుగునా గుంతలు ఏర్పడి పూర్తిగా ధ్వంసమయ్యాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి. – అశన్న, మల్లాపూర్

మరమ్మతులు చేపట్టాలి



మండలకేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లు దెబ్బతిన్నాయి. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. ప్రజలు ఇబ్బంది పడకుండా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. – ముత్యం, పీచర

ప్రతిపాదనలు పంపాం

మండలంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవగానే చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. – సంజయ్‌కుమార్, పీఆర్ ఏఈ

సాఠే జయంతి



నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

కుంటాల: మండలంలోని లింబా(కె) గ్రామంలో అన్నాభావు సాఠే జయంతి నిర్వహించారు. సాఠేను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పలువురు పేర్కొన్నారు. అనంతరం ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సవ్వి అశోక్ రెడ్డి, ఆనంద్‌రావు పటేల్, వీడీసీ చైర్మన్ ముత్యంరెడ్డి, గోనె గజ్జారాం, సాఠే గ్రామ కమిటీ అధ్యక్షుడు గణేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.